కిలో పచ్చి మిర్చి రూ.100పైనే!



పరిగి, మే 23 : పరిగి మార్కెట్‌లో పచ్చి మిరపకాయల ధర భగ్గుమంటోంది. మొన్నటి వరకు కిలో రూ.40 నుంచి రూ.50 ఉన్న ధర గురువారం రూ.100 నుంచి రూ.120కి చేరింది. వానాకాలం సీజన్ ప్రారంభంలో తగ్గాల్సిన మిర్చి ధరలు పెరగడమేంటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.



మట్టే కదా.. దాంతో ఏం వ్యాపారం చేస్తారనుకోవచ్చు.. కానీ ఆ దందాలోనే ఉంది మతలబు! పరిగి ప్రాంతంలోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకన్నంత అన్నట్లుగా మట్టి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. రాత్రి వేళ మట్టి తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొతున్నారు. ఇక్కడి భూముల్లో మట్టి తవ్వకాలు రెవెన్యూ అధికారులకు అక్రమ ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్‌లోని పోసం చెరువులో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. చెరువు శిఖం, కట్టలను కూడా వదలకుండా తవ్వేస్తుండడంతో సొరంగాలు పడి కట్ట బలహీనమై ఏకంగా చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. వర్షాలు కురిస్తే కట్ట తెగిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే అసైన్డ్ భూముల్లోనూ తవ్వకాలు చేపడుతూ మైదాన నేలను లోయలుగా మారుస్తున్నారు.



పోసం చెరువు కట్ట వద్ద చేపట్టిన మట్టి తవ్వకాలు

తవ్వేస్తూ.. దోచేస్తున్నారు

పరిగి ప్రాంతంలో జోరుగా మట్టి దందా

- మట్టి తరలింపుతో లోయలుగా మారుతున్న భూములు
- అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత!
- రాత్రింబవళ్లు యథేచ్ఛగా టిప్పర్లలో తరలింపు
- రూప్‌ఖాన్‌పేట్ పోసం చెరువు, కట్ట తవ్వకాలు
- సొర్కెలతో ప్రమాదకరంగా చెరువు పరిసరాలు
- అధికారులకు కాసులు కురిపిస్తున్న మట్టి దందా

పరిగి, మే 23 : పరిగిలో మట్టి అక్రమ తరలింపు దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అనుమతులు లేకుండానే నిబంధనలను తుంగలో తొక్కి, కొందరు అక్రమార్కులు మట్టి అక్రమ తరలింపునకు తెరలేపారు. రాజకీయ పలుకుబడి, అధికారుల సహకారంతో మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఈ మట్టి తరలింపు ద్వారా కొందరు వ్యాపారులు నిత్యం లక్షల్లో సంపాదిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టిని రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. గుట్టలకు, గుట్టలను కరగ దీస్తున్నారు. చెరువులను, కట్టలను కూడా వదలడం లేదు. రాత్రింబవళ్లు తవ్వకాలు జరిపి బల్లపరుపు నేలలను లోయలుగా మారుస్తున్నారు. ఈ తవ్వకాలను ఎక్కువగా ప్రభుత్వ భూముల్లోనే జరుపుతున్నారు. తవ్విన మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తున్నారు. రాయల్టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కల్పించే మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నామ్‌కే వాస్తేగా నాలుగైదు ఎకరాల్లో మైనింగ్‌కు అనుమతి పొంది పదుల ఎకరాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు, వ్యాపారులు కుమ్మక్కవడంతో మట్టి తరలింపును నిరాఘాటంగా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయానికి గండి పడుతూ నేల రూపురేఖలు కోల్పోతోంది.

నిబంధనలకు పాతరేసి

పరిగి ప్రాంతంలోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత మట్టి అనేలా వారి వ్యాపారం కొనసాగుతోంది. పేదల అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో చేస్తున్న మట్టి తవ్వకాలతో రెవెన్యూ అధికారులకు ఆదాయం వస్తోంది. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్‌లోని పోసం చెరువులో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. చెరువు శిఖం, కట్టను కూడా వదలకుండా తవ్వకాలు జరుపుతున్నారు. ఇటీవల గ్రామస్తులు చెరువు వద్ద తవ్వకాలను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ సైతం జరిగింది. అలాగే ఇదే మండలం ఇబ్రహీంపూర్, రంగంపల్లి, తుంకులగడ్డ, సుల్తాన్‌పూర్, జాఫర్‌పల్లి, సయ్యద్ మల్కాపూర్, ఖుదావంద్‌పూర్, రాఘవాపూర్‌లలో మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారుల కళ్లముందే ఈ తతంగం జరుగుతున్నా తమకెందుకులే అన్నట్లు వ్యహరిస్తున్నారే తప్పా, తవ్వకాలను అడ్డుకోవడం లేదు. అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ సాగు భుములను లోయలుగా మారుస్తున్న విషయంపై స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. తవ్వకాలపై గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని కొద్దిసేపు హడావుడి చేసి మట్టి వ్యాపారుల వద్ద మామూళ్లు తీసుకొని జేసీబీలను, ట్రాక్టర్లను వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తరువాత రివర్స్‌గా సమాచారం ఇచ్చిన వారికే ఫోన్ చేసి.. 'అక్కడ ఎవరూ లేరు. మీరు ఎప్పుడు చుశారు?' అంటూ తమను ప్రశ్నిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చూస్తే మట్టి తవ్వకాలు కన్పించవా? అని స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలు జరపకుంటే తామెలా సమాచారం ఇస్తాం? అని వారు అంటున్నారు.

మట్టి దందాలో అందరి పాత్ర

పరిగి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న మట్టి దందాలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. మట్టి అక్రమ దందా పంచాయితీ సైతం పోలీసుల వద్దే జరుగుతోందంటే ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది. అధికార, విపక్ష పార్టీల నాయకులు మట్టి దందాలను నడిపిస్తున్నారు. మట్టి వ్యాపారులిచ్చే డబ్బులకు ఆశపడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యాపారంలో ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఆ తర్వాత ఒప్పందాలు చేసుకుంటున్నారు. మట్టి దందా పంచాయితీలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే సెటిల్ చేస్తున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తం అవుతున్నాయి.



రాత్రిపూట మట్టి తోడుతున్న ఎక్స్‌కవేటర్, తరలిస్తున్న టిప్పర్లు

వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు



అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సహకారంతోనే మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రికి రాత్రే మట్టిని తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. మా గ్రామంలోని భూముల రూపురేఖలనే మార్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అడ్డుకోకుంటే ఆందోళనలు చేపడతాం.

- జి.రాంచందర్, రూప్‌ఖాన్‌పేట్

అడ్డుకున్నా తరలింపు ఆగడం లేదు



పోసం చెరువులో మట్టి తవ్వకాలపై ఇటీవల అడ్డుకున్నాం. మీరెవరని మమ్మల్నే బెదిరిస్తున్నారు. మట్టి తరలింపులకు అనుమతుంటే రాత్రిపూటే ఎందుకు తరలిస్తున్నారు? గ్రామస్తులమంతా కలిసి మట్టి తవ్వొద్దని అడ్డుపడినా మమ్మల్ని లెక్క చేయడం లేదు. ఈ దందాపై అధికారులే చర్యలు తీసుకోవాలి.

- కోట్ల నర్సింహులు, రూప్‌ఖాన్‌పేట్

ఫిర్యాదు చేసినా అధికారుల చర్యలు శూన్యం



అక్రమంగా మట్టి తరలింపుపై మేము ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారొచ్చి చూడడం లేదు. మట్టి తవ్వినట్టు ఇంత స్పష్టంగా ఆధారాలు కన్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. మట్టి తోడిన ఫొటోలను కూడా అధికారులకు చూపాం. మట్టి తరలింపుతో చెరువు, కుంటల కట్టలు బలహీనమవుతున్నాయి. అధికారులు వెంటనే మట్టి తరలింపును అడ్డుకోవాలి.

- కె.మైపాల్, రూప్‌ఖాన్‌పేట్




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మే 23 : జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 11 వరకు జరిగే పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 25పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థుల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయానుకూలంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. జూన్ 3 నుంచి 11 వరకు జరిగే పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రేణుకాదేవి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి జోసెఫ్, మిషన్ భగీరథ అధికారి బాబు శ్రీనివాస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతన్న కల్నల్ అనిల్‌కుమార్

దేశంలోని అన్ని సంస్కృతులను గౌరవించాలి



రాజస్థానీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మేడ్చల్ టౌన్, మే 23 : దేశంలో ఉన్న విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను దేశ పౌరులు ప్రతీ ఒక్కరు గౌరవించాలని కల్నల్ అనిల్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న 'ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్' కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశంపై గౌరవాన్ని పెపొందించడంతో పాటు దేశ సంస్కృతులు, సంప్రదాయలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ కేడర్ విద్యార్థులకు ఒక వేదికపై తీసుకువచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. రాజస్థాన్ కేడర్ల ఎన్‌సీసీ క్యాడెట్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ ఎం.ఆనంద్‌రావు, కళాశాల ఎండీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలేవీ?

ఆసన్నమవుతున్న హరితహార సమయం

- నర్సరీల్లో ఎదగని మొక్కలు
- మండుతున్న ఎండలు, నీటి కొరతే కారణం
- అధికారులు చర్యలు తీసుకుంటేనే ఫలితం

మేడ్చల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం నర్సరీల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వానాకాలం నాటికి లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయించడం లేదు. ఎండల తీవ్రత, నీటి ఎద్దడి మూలంగా మొక్కల ఎదుగుదల లోపించింది. పాలిథీన్ కవర్లలో పేరుకున్న కలుపు మొక్కలను తొలగించకపోవడమూ మరో కారణంగా చెప్పొచ్చు. రూ.లక్షలు వెచ్చించి నర్సరీలను కొనసాగిస్తున్నా ప్రయోజనం చేకూరడం లేదు. జిల్లాలో 61 పంచాయతీల్లో హరితహారం నర్సరీలు పెంచుతున్నారు. వీటిల్లో గతేడాది నాటగా మిగిలిన మొక్కల్ని సంరక్షిస్తూ ఈ ఏడాది కొత్తగా మొక్కల్ని పెంచుతున్నారు. గత సీజన్‌లో ప్రతీ పంచాయతీలో పదేసి వేల మొక్కలు నాటారు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంది. దీని ప్రభావంతో నర్సరీల్లో వేసిన బోర్లు ఎండిపోయాయి. బయటి నుంచి నీళ్లు తెచ్చి మొక్కలకు పోసే పరిస్థితి లేదు. కొన్ని చోట్ల కొత్తగా బోర్లు డ్రిల్ చేయించారు. మరికొన్ని చోట్ల ఉన్న బోర్ల మరమ్మతులకు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో పంచాయతీ ట్యాంకర్లతో నీరు పోస్తున్నా మొక్కలు మాత్రం ఆశించిన స్థాయికి ఎదగలేదు. ఈ సారి వర్షాలు ముందే పడే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ నెల రెండో వారం నుంచే అడపాదడపా వానలు పడుతున్నాయి. కాగా వానలు బాగా కురిస్తే జూన్‌లో హరితహారం మొక్కలు నాటాల్సి ఉంది. అయితే నర్సరీల్లో పరిస్థితులను గమనిస్తే ఆ లోగా మొక్కలు ఎదిగే పరిస్థితులు కన్పించడం లేదు. తీవ్ర ఎండలు, నీటి ఎద్దడి మూలంగా మొక్కలు ఆశించినంతగా ఎదగడం లేదని నర్సరీల నిర్వాహకులు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల మూలంగా మొన్నటి వరకు ప్రతి ఉద్యోగి బిజీగా ఉన్నారు. దీంతో నర్సరీలపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. నిర్వాహకుల్లోనూ నిర్లక్ష్యం పెరిగింది. పర్యవసానంగా మొక్కలు అనుకున్న స్థాయిలో పెరుగలేదు. ఎన్నికలు ముగిసి పది రోజులవుతోంది. ఇకనైనా జిల్లా అధికారులు హరితహారం నర్సరీల పర్యవేక్షణపై దృష్టిసారించాల్సి ఉంది. ఎదగని మొక్కలకు చాలినంత ఎరువులు వేయించి అవి వేగంగా పెరిగేలా చర్యలు తీసుకుంటేనే వానలు పడే రోజుల్లో మొక్కలు నాటేందుకు అవకాశం ఉంటుంది.



ఎదులాబాద్‌లోని నర్సరీలో సరిగా ఎదగని మొక్కలు

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు



- ఉదయం ఫస్టియర్.. మధ్యాహ్నం సెకండియర్ పరీక్ష
- పరీక్షలు కొనసాగే సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్

వికారాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వమిస్తారు. జనరల్, ఒకేషనల్ గ్రూపుల విద్యార్థులు కలిపి మొత్తం 7,831 మంది సప్లిమెంటరీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఫస్టియర్‌కు 4,621, సెకెండియర్ పరీక్షలకు 3,210 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు 20కేంద్రాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్‌లో 5, తాండూరు 4, పరిగి 4, నవాబ్‌పేట్, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట్, దోమ, కొడంగల్, కులకచర్ల మండల కేంద్రాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నాయి. సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసేయిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది.

మేడ్చల్ జిల్లాలో 89 పరీక్ష కేంద్రాలు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి జిల్లాలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లా మెరుగైన ఫలితాలనే సాధించినా పలు ప్రభుత్వ కళాశాలల కొంత నిరాశపర్చాయి. పరీక్ష ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఫైయిలైన విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ కళాశాలలు సెలవుల్లోనూ విద్యార్థుల సందేహాలు తీరుస్తూ పరిమితంగా బోధన సాగించాయి. కాగా మేడ్చల్ జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 89 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరంలో 36,940 మంది, ద్వితీయ సంవత్సరంలో 13,503 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం వివిధ శాఖల అధికారులతో ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసింది. పరీక్షలకు 89 చీఫ్ సూపరింటెంట్‌లను, 89 మంది డిపార్టుమెంటల్ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షల సామగ్రిని కూడా అధికారులు కేంద్రాలకు పంపిణీ చేశారు. కేంద్రాల్లో తాగునీటి వసతి, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యాన్లు వంటి పలు సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు

సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు tsbie.cgg.gvo.in నుంచి కూడా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కిషన్ తెలిపారు. వాటిపై కళాశాల ప్రిన్స్‌పాల్ సంతకం లేకున్నా పరీక్షలకు అనుమతిస్తారని పేర్కొన్నారు. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే ఒత్తిడి లేకుండా పరీక్ష రాయవచ్చని ఆయన సూచించారు.

ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశాం. 89పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలి. పరీక్ష కేంద్రాలకు గంట ముందు విద్యార్థులు చేరుకోవాలి. ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్న తర్వాతే సమాధానాలు రాయాలి. గత పరీక్షల్లో చేసిన పొరపాట్లను పునరావృతం కాకుండా చూసుకోవాలి.

- కిషన్, జిల్లా ఇంటర్ విద్యాధికారి, మేడ్చల్

వసతుల కల్పనలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్



కేశవరంలో మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మూడుచింతలపల్లి, మే 23 : విద్యార్థులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు, వసతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. మూడుచింతలపల్లి మండలం కేశవరం, మూడుచింతలపల్లి గ్రామాల్లో డ్వాక్రా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న మహిళాశక్తి టైలరింగ్ సెంటర్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫారాలు వేగవంతంగా కుట్టాలన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి స్టిచింగ్ పూర్తయితే విద్యార్థులకు అందజేస్తామన్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాల కింద కేశవరం జెడ్పీ పాఠశాలలో చేపడుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. అధికారుల పరివేక్షణలో పనులను నాణ్యతగా వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాంబశివరావు, ఎంపీడీవో వత్సలాదేవి, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, డీపీఎం సురేఖ, ఈఈపీఆర్ వేణుగోపాల్, ఏపీఎం మున్నుస్వామి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గౌతమి, రాజేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, మే 23: 'అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ' అనే శీర్షికను మే 19న ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు మార్గంలోని కల్వర్టు నిండి మురుగునీరు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం ఎక్సావేటర్‌తో కల్వర్టు కింద పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి మురుగు నీటి పారుదలకు తగిన చర్యలు తీసుకున్నారు. ఏట్టకేలకు అధికారులు స్పందించి మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చడంతో స్థానిక ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



బషీరాబాద్- తాండూరు ప్రధాన రోడ్డులో చెత్తను తొలగించి మెరుగు పర్చిన కల్వర్టు

నేడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళా

కొడంగల్, మే 23: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం వారి ఆధ్వర్యంలో శుక్రవారం విత్తన మేళాను నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రాజురాథోడ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విత్తన మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలు విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెంలో జరిగే అవగాహన సదస్సుకు రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలేష్

మేడ్చల్, మే 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ లెవల్ ట్రైనర్స్ కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, ఈవీఎం కౌంటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ నోడల్ అధికారి కేశురాం, ట్రైనర్స్ తిరుమలేష్, గోపాల్, రంగాచారి పాల్గొన్నారు.

కోర్టు ఆర్డర్ ఉన్న సర్వే నంబర్లు బ్లాక్ చేయాలి



కోర్టు ఆర్డర్ కాపీని తహసీల్దార్ అందజేస్తున్న బాధితులు

బషీరాబాద్, మే 23: కోర్టు ఆర్డర్ ఉన్న సర్వే నంబర్లను ఇకనైనా బ్లాక్‌లో పెట్టాలని బాధిత మహిళలు గురువారం బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్‌ను కలిసి విన్నవించారు. మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన ఆశన్‌పల్లి మణెమ్మ, ఇద్దరు కూతుళ్లు లక్ష్మి, శృతి ఈనెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ భూమి విషయంలో జరిగిన రిజిస్ట్రేషన్ మోసంపై అధికారులతో వాగ్వివాదానికి దిగి తమకు న్యాయం జరుగకపోతే పెట్రోల్ డబ్బాను తీసి ఒంటిపై పోసుకుని చస్తామని బెదిరించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో మరోసారి బాధితమహిళలు కోర్టు ఆర్డర్ కాపీని తహసీల్దార్‌కు స్వయంగా అందజేశారు. తమను మోసం చేసి వేరొకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేసిన భూమిని కూడా బ్లాక్‌లో పెట్టాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



అధ్యాపకురాలు శారదను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

చేవెళ్ల, మే 23 : విలువలతో కూడిన విద్య నేర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ శారద తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2004-06 సంవత్సరంలో ఎంపీసీ చదువుకున్న విద్యార్థులు గురువారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకురాలు శారదను వారు ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరినొకరు సంతోషంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, పిల్లలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వకపోయినా చదివించాలని సూచించారు. 18 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమేశ్, నవాజ్, శ్రీనివాస్, రంగయ్య తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు

చేవెళ్ల, మే 23 : మండల పరిధిలోని రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి తులసి తెలిపారు. మండలానికి 240 క్వింటాళ్ల జనుము, 8 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, 60 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. జనుము 40 కిలోల బస్తాను రూ. 1448, జీలుగ బస్తా 30 కిలోలు రూ.1,116 చెల్లించి తీసుకెళ్లాలని సూచించారు. పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలను అందజేసి రైతు వేదికల్లో పర్మిట్లు రాయించుకొని ముడిమ్యాల్ పీఏసీఎస్ కార్యాలయంలో విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి విగ్రహమూర్తులను తరలిస్తున్న భక్తులు

- వైభవంగా చెన్నకేశవస్వామి పరిణయ వేడుక
- ఉట్లపల్లి దేవునిగుట్టకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం.. హాజరైన ప్రముఖులు

కందుకూరు, మే 23 : మండల పరిధిలోని ఉట్లపల్లి దేవునిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వేద పండితులు రేవెళ్ల రాజు శర్మ ఉదయం సర్వదేవతల అభిషేకాలు, సుదర్శన హోమం, శ్రీరుద్రహోమం, ఆంజనేయ హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మండంలోని దాసర్లపల్లి, సాయిరెడ్డిగూడ, కందుకూరు, కొత్తగూడ, దెబ్బడగూడ, గ్రామాల భక్తులతో పాటు కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు షామియానాలు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కాగా, స్వామివారి కల్యాణానికి చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ పంచాయతీ సెల్ రంగారెడ్డి జిల్లా మాజీ కన్వీనర్ సాధ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ బి.మల్లేష్, నాయకులు జిట్ట రాజేందర్‌రెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, ఊటు మహేందర్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా అనంతపద్మనాభుడి కల్యాణం

- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, మే 23 : మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో గల శ్రీదేవి, భూదేవి సమేత అనంతపద్మనాభస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఆలయ పాలకమండలి చైర్పర్సన్ అనితారెడ్డి ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ఈనెల 21న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ముగిశాయి. వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపించారు. సాయంత్రం పెంజర్ల గ్రామంలో దేవతా మూర్తులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. దేవాలయ పాలకమండలి ఆధ్వర్యంలో పెద్దయెత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని శంషాబాద్‌కు చెందిన శ్రీనటరాజా డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో దేవతామూర్తుల నృత్యాలతో భక్తులను అలరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే శంకర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాసుందర్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు దేశాల అంజమ్మ, రవీందర్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మామిడి జనార్ధన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఎమ్మె సత్యనారాయణ, ఎం.శివశంకర్‌గౌడ్, జె.గోవర్ధన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, అగ్గనూరు విశ్వం, రాంరెడ్డి, విక్రంరెడ్డి, భీంరెడ్డి, దయానంద్‌గుప్త, రవినాయక్, సుధాకర్, వన్నం బాల్‌రాజ్, దామోదర్‌రెడ్డి, దేశాల భీమయ్య, కుమ్మరి రమేష్, పాముల రమేష్, నవీన్‌చారి, జగన్, సురేష్‌గౌడ్, శ్రీశైలం, సాయి తేజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పాలకమండలి సభ్యులు



అనంత పద్మనాభస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



వెంకటాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకుడు

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, మే 23: మండలంలోని వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిపించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపాన్ని పచ్చనితోరణాలతో సుందరంగా అలంకరించి అమ్మవార్లను, స్వామివారిని ప్రతిష్ఠించారు. ఆలయ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ స్వామివారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం గురించి భక్తులకు వివరించారు. అమ్మవార్లకు, స్వామివారికి జీలకర్ర బెల్లం సమర్పించారు. వేదపండితులు భక్తులకు మాంగళ్యధారణ చూపించి కల్యాణం చేయించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు, స్వామివారికి ఓడిబియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కందుల నవీన్, శంకర్, లింగం, రామకృష్ణరెడ్డి, గుర్రం కళావతి, కట్ట శేఖర్, ఆలయ ఈవో లగడపాటి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ నీరుడి రామారావు, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నీరుడి గీతాశ్రీనివాస్ బాల్‌రాజ్, బుర్ర వెంకటేష్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, కర్రె రాజేష్, వినోద్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాహుల్‌ను కలిసిన మల్లు రవి

ఆమనగల్లు, మే 23: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రెస్టారెంట్ ప్రారంభించడానికి వచ్చిన రాహుల్‌గాంధీని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు మల్లు రవి పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు ఆయన తెలిపారు.



రాహుల్ గాంధీతో మల్లు రవి



విద్యార్థుల యుని ఫారంలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

విద్యార్థుల యూనిఫాం సకాలంలో అందజేయాలి

- అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

ఘట్‌కేసర్ రూరల్, మే 23: విద్యార్థులకు యునిఫారంలను సకాలంలో అందజేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య కుట్టు మిషన్ కేంద్రం మహిళలను ఆదేశించాడు. మండలంలోని కొర్రెములలోని కుట్టుమిషన్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. మహిళలు కుడుతున్న విద్యార్థుల పాఠశాల యూనీఫాంలను పరిశీలించారు. వచ్చేనెలలో పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థులకు యూనీఫాంలు కుట్టి సకాలంలో అందించాలన్నారు. యూనీఫాం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కరుణాకర్‌రెడ్డి

షాద్‌నగర్ అభివృద్ధికి సహకరించండి

- మంత్రిని కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బర్త్‌డే విషెస్

షాద్‌నగర్/మహేశ్వరం, మే 23 : షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. గురువారం మంత్రి కోమటిరెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులకు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్ పట్టణాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వీర్లపల్లి పేర్కొన్నారు. అదే విధంగా వెంకట్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మహేశ్వరం మండలం తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరం అభివృద్ధికి సహకరించాలని కరుణాకర్‌రెడ్డి మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందించినట్లు కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

మరమ్మతుల పేరిట అక్రమాలు

- పారిశుధ్య విభాగంలో అడ్డగోలుగా చెల్లింపులు
- ఎక్కడి వాహనాలు అక్కడే
- రెండు నెలలకే మళ్లీ మరమ్మతులు

తాండూరు, మే 23: తాండూరు పారిశుధ్య విభాగంలో అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాహనాల మరమ్మత్తుల ఖర్చు పేరిట ఖజానా నుంచి డ్రాఅవుతున్నాయి. వాహనాలు మాత్రం ఇప్పటి మూలన పడ్డాయి తప్ప చెత్తసేకరణకు వెళ్లడం లేదు. లక్షల్లో నిధులు ఖర్చవుతుండటంతో వార్డుల్లోకి చెత్త వాహనాలు రాకపోతుండడంతో పారిశుధ్యంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మున్సిపాలిటీలో చెత్త సేకరణ నిమిత్తం 28ఆటోలు, 10ట్రాక్టర్లు, రెండు టిప్పర్లు ఉన్నాయి. నాలుగేళ్ల కిందట కొనుగోలు చేసిన ఆటోలు, ట్రాక్టర్లకు సరైన సమయంలో సర్వీసింగ్ లేక తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మరమ్మతులు చేయించాలని కౌన్సిల్ తీర్మానం కూడ చేశారు. అనంతరం మరమ్మతుల పనిని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే మరమ్మతులు చేయించే విషయంలో మాత్రం ఇంజనీరింగ్, పారిశుధ్యం విభాగం అధికారుల నిర్లక్ష్యం కమిషనర్ పర్యవేక్షణ లేక పోవడంతో మూడు నెలలకే ఆటోలు, టిప్పర్లు ట్రాక్టర్లు మూలనపడ్డాయి. మరమ్మతులు చేయించినందుకు సదరు కాంట్రాక్టర్‌కు రూ.5.50లక్షల నుంచి రూ.7లక్షల వరకు చెల్లింపులు చేశారు. ఆటోలు మరమ్మతులు సరిగ్గా చేయకపోవడం నామమాత్రంగా తూతూమంత్రం చేయ డంతో మళ్లీ మూలనపడ్డాయి. 10ఆటోలు మరమ్మతు కార్యాలయం వెనక భాగంలో ఉన్నాయి. నిధులుచెల్లించే ముందు పరిశీలించకపోవడంతో ఆటోలు మరమ్మతుకొచ్చాయని సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో చెత్తవాహనాలు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తుండడం, ఎక్కడబడితే అక్కడ చెత్తవేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రెండు నెలల కిందట రిపేర్ అయిన జేసీబీకి ఇటీవల రూ.2లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. మళ్లీ తాజాగా జేసీబీని మరమ్మతులకు తరలించారు. మిషన్ భగీరథ పనులకు ఈ జేసీబీని వినియోగించడమే మరమ్మతులకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు టిప్పర్లు మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డాయి. ఈ టిప్పర్లకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



తాండూరు మున్సిపాలిటీలో మరమ్మతులకు వాహనాలు



మెకానిక్ షెడ్డులో ఉన్న మరమ్మతులకు గురైన ఆటోలు



రిపేర్ అయిన మళ్లీ మరమ్మతుకు గురైన జేసీబీ

నిబంధనలు జాన్తానై!

అవుషాపూర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- సెట్‌బ్యాక్‌లు లేకుండానే ఇళ్ల కట్టడాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, మే 23: గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జి+2కు అనుమతులు తీసుకొని జి+3 నుంచి 4 నిర్మాణాలు, భవనాలకు సెల్లార్లు కడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అవుషాపూర్, వెంకటాపూర్, కొర్రెముల, ఘనాపూర్ తదితర గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మొన్నటి వరకు అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నం కావడంతో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. అనుతుల్లేని సెల్లార్లు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్‌లు లేకుండ నిర్మాణాలు చేపడుతున్నారు. అవుషాపూర్‌లో జోరుగా జి+3, 4 నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అనుమతి లేకుండానే సెల్లార్ నిర్మాణం చేపట్టాడు. కేపాల్ సమీపంలో సెట్‌బ్యాక్‌లు లేకుండానే ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చేడడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

ఇటీవలే అవుషాపూర్ పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా వచ్చాను. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటా. కేపాల్ సమీపంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌కు హెచ్ఎండీఏ అనుమతి ఉంది. కానీ పంచాయతీ అనుమతి తీసుకోలేదు. ఇక్కడ సెట్‌బ్యాక్ గురించి తెలుసుకొని చర్యలు తీసుకుంటా.

- వేణుగోపాల్‌రెడ్డి, అవుషాపూర్ పంచాయతీ కార్యదర్శి

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ఎదులాబాద్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడిగితెలుసుకుంటున్న విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మే 23: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే సేకరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని మాదారం, ఎదులాబాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురాగానే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీసంచులు, టార్పాలిన్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ధాన్యసేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారులకు ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో ధాన్యసేకరణ పూర్తిచేయాలన్నారు. ధాన్యాన్ని సేకరించిన వెంటనే ట్యాబ్‌లోకి అప్‌లోడ్ చేసి రైతులకు బిల్లులు సకాలంలో వచ్చేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్‌నాయక్, డీసీఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ పాండురంగం, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్ఐ పద్మనాభచారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- జిల్లా కేంద్రంలో మూడు సెంటర్లలో ప్రవేశ పరీక్ష
- దరఖాస్తు చేసుకున్న 1321 మంది అభ్యర్థులు

వికారాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్ పరీక్షకు జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిసెట్ శుక్రవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగే పాలిసెట్ కోసం జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు మొత్తం 1321 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కొంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 240 మంది విద్యార్థులను కేటాయించారు. ఎన్నేపల్లిలోని భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 600 మంది, శ్రీఅనంత పద్మనాభ (ఎస్‌ఏపీ) కళాశాలలో 481మంది విద్యార్థులను కేటాయించారు. ప్రవేశపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒకగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త ఎం.పరమేశ్వర్ తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆయన స్పష్టంచేశారు. అభ్యర్థులు తమవెంట డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పాటు బ్లూ లేదా బ్లాక్‌పెన్, హెచ్‌బీ బ్లాక్‌పెన్సిల్, ఎరేజర్ తీసుకుని రావాలని సూచించారు. హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ కాని వారు ఒక పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోను వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతిలేదని ఆయన స్పష్టం చేశారు. పాలీసెట్ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర ప్రారంభం

- నెల రోజులపాటు జరుగనున్న ఉత్సవాలు
- పొరుగు రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- జూన్ 7న రథోత్సవం

తాండూరు రూరల్, మే 23: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగుతున్న తాండూరు మండల కొతాలపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. నెలరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో వెలిసిన కొత్లాపూర్ రేణు కా ఎల్లమ్మ ఆలయంలో శుక్ర, మంగళవారాల్లో వేలసంఖ్యలో భక్తులు తరలివస్తారు. జిల్లా లోని వివిధ గ్రామాలతోపాటు పొరుగు ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక వాహనాలు, బస్సులు, రైళ్లలో జాతరకు తరలివస్తుంటారు. ముఖ్యంగా నూతనంగా వివాహం చేసుకున్న వధూవరులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నేవైద్యాలు సమర్పిస్తారు. ఆల య ప్రాంగణంలో నవ దంపతులకు ఓడి బియ్యం పోయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పరిసరాల్లోని పంటపొలాల్లో ప్రత్యేకంగా పిండి వంటకాలు చేసి అమ్మ వారికి సమర్పించి సహపంక్తి భోజనాలు చేస్తారు.



జూన్ 7న రథోత్సవం, సిడే

జాతరలో ప్రధానఘట్టమైన రథోత్సవాన్ని జూన్ 7వ తేదీన సాయంత్రం నిర్వహించనున్నారు. దీంతోపాటు జరిగే సిడే ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రాత్రిబసకోసం ఆలయంలో నిగదులను కేటాయిస్తారు. 24గంటలపాటు తాగునీటి సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. వాహనాల పార్కింగ్‌కు ఐదెకరాలకుపైగా స్థలాన్ని సిద్ధం చేశారు. జూన్ 22న ఉత్సవాలు ముగియనున్నాయి. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయం

బడ్జెట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ట్రస్మా రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నాగయ్య



మాట్లాడుతున్న ట్రస్మా రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నాగయ్య

వికారాబాద్, మే 23: రూ.5వేల నుంచి రూ.25వేల ఫీజు ఉండే బడ్జెట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ట్రస్మా రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నాగయ్య అన్నారు. వికారాబాద్‌లో ఆయన గురువారం ట్రస్మా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్మా ఆధ్వర్యంలో 35సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణ, విద్యార్థులను విద్య, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో శిక్షణ ఇచ్చి ముందంజడంలో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డీసీఈబీ ఫీజు ఒకేవిధంగా ఉండేలా చూడాలని కోరారు. పాఠశాల యాజమానులకు పాఠశాల సిబ్బందికి రూ.10లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని విద్యుత్ బిల్లులో రాయితీ ఇవ్వాలని కోరారు. బడ్జెట్ పాఠశాలల స్థాయిని బట్టి రుణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, కార్యదర్శి ఎస్ఎన్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, రాంచంద్రయ్య, వెంకటరెడ్డి, ప్రకాశ్, చంద్రశేఖర్, రవీందర్, మోహన్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, వేణుగోపాల్, అజారుద్దీన్, బాబురావు, సుధీర్, విక్రమ్‌రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మతపరమైన రిజర్వేషన్లపై బెంగాల్ హైకోర్టు తీర్పు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, మే 23: మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ హైకోర్టు తీర్పు నివ్వడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. ఆయన కులకచర్లలో గురువారం ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఉన్న ఓబీసీలు అంతా గర్వించబడే విధంగా బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని హైకోర్టు తీర్పును ఇచ్చి మమతా బెనర్జీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటి నిర్ణయం తీసుకుందన్నారు. 2010 సంవత్సరం నుంచి ఓబీసీల రిజర్వేషన్లను కట్ చేస్తూ మతపరమైన రిజర్వేషన్లను 77ఉపకులాలైన ముస్లింలఇచ్చినట్లు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా మతపరమైన రిజర్వేషన్లను కల్పిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు జెమిని సూర్యకాంత్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటన్‌పల్లి అంజిలయ్య, మాజీ సర్పంచ్ డాక్టర్ జానకిరామ్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ విజయ్, మండల ప్రధాన కార్యదర్శులు సీహెచ్ హనుమంతు, నర్సింహారెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి అన్నసారం శ్రీశైలం, మండల ఉపాధ్యక్షుడు పెరమళ్ల వెంకటేశ్, రామచంద్రయ్య, రాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్

మేడ్చల్ టౌన్, మే 23: మేడ్చల్ మండలంలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొన్ని పాఠశాలలకు 7వ తరగతి వరకు అనుమతి ఉన్నప్పటికీ 10వ తరగతి వరకూ బోధిస్తున్నారని తెలిపారు. కొన్నిపాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫీజులు వసూలుచేసి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు కార్పొరేట్ విద్యాసంస్థలు 25శాతం నిర్బంధ విద్యను తమ సంస్థల్లో అమలుచేయడంలేదని ఆరోపించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాక ముందు విద్యాధికారులు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపడతామని రాథోడ్ హెచ్చరించారు.

అనురాగ్‌లో నేషనల్ స్టూడెంట్ ఫోరమ్ పోస్టర్ ఆవిష్కరణ



అనురాగ్ యూనివర్సిటీలో నేషనల్ స్టూడెంట్ ఫోరమ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా అనురాగ్

ఘట్‌కేసర్ రూరల్, మే 23: మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం నేషనల్ స్టూడెంట్ ఫోరమ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజీ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ పల్లా అనురాగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే నేషనల్ స్టూడెంట్ ఫోరమ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫోరమ్‌లో లైఫ్ స్టైల్, ప్రొడక్ట్ అండ్ ఫైనాన్స్ రంగాల్లో నెలకొన్న పరిశీలించి పరిష్కారాలను ప్రతిపాదించే విధంగా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

కొడంగల్, మే 23: పెద్దనంది గామ, పర్సాపూర్ గ్రామాల్లో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన వరిధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తుండటంతో వరిధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

● హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



జాతర ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

బషీరాబాద్, మే 23: మండలంలోని పర్వత్‌పల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర గురువారం వైభవంగా ముగిసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గోవింద మాంబ, వీరబ్రహ్మేంద్రస్వాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రి 11గంటలకు రథోత్సవం జరగగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వీక్షించారు. రెండోరోజు గురువారం ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం పోలేరమ్మకు మహిళలు బోనాలు తీశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్ అజయ్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాంబండ దేవాలయ అభివృద్ధికి కృషి

కులకచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పాంబండ గిరిప్రదక్షిణలో గురువారం ఆయన పాల్గొన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల, పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి ప్రతీనెల పౌర్ణమిరోజు హిందూ బంధువుల ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. అందులో భాగంగా గురువారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించి పాంబండ 17వ గిరిప్రదక్షిణలో ఎమ్మెల్యేతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాంబండ దేవాలయ అభివృద్ధికి గతంలో కులకచర్లకు తాను గతంలో ప్రత్యేక నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. పాంబండ గిరి ప్రదక్షిణ చేపట్టడం అభినందనీయం అన్నారు. భగవద్గీత ప్రచారకురాలు జయశ్రీ మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మంలో ప్రతీ హిందువు భాగస్వాములు కావాలని, చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. ప్రతీ హిందువు నుదుట బొట్టుపెట్టుకొని హిందువుగా గర్వపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, వైస్‌చైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రాకొండ గ్రామస్థులు

దోమ, మే 23: మండలంలోని రాకొండ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గురువారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాజీ సర్పంచ్ చాపల లక్ష్మయ్య, ఉపసర్పంచ్ కొత్త జంగయ్య మాట్లాడుతూ.. కార్యదర్శి రవి కుమార్ తన సమీప బంధువు తోటమోని శ్రీనివాస్ పేరుపై రూ.లక్షా 50వేలు, పెద్దమాల నర్సింహులు పేరుపై రూ.50వేలు కార్యదర్శి కాజేశాడని ఆరోపించారు. అదే విధంగా మాజీసర్పంచ్ మరిది పనులు చేయకున్నా పంచాయతీ కార్యదర్శి సహకారంతో తప్పుడు ఎంబీ రికార్డులు సృష్టించి రూ.5లక్షల 50వేలు డ్రా చేశారని ఆరోపించారు. ఆయా శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించకుండా, పనులను పరిశీలించకుండా తన ఇష్టానుసారంగా తప్పుడు ఎంబీలు చేశారని గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. డబ్బులు డ్రా చేయనివ్వకుండా అధికారులకు ఫిర్యాదు చేసినా రెండు నెలల కిందట విధుల్లో చేరిన రాకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తన ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడి తప్పుడు బిల్లులు చూపించి గ్రామ అభివృద్ధికి ఉన్న రూ.9లక్షలు గ్రామస్థులకు సమాచారం ఇవ్వకుండా డ్రా చేశాడని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపి రాకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు నర్సింహులు,బండి చిన్న నర్సింహులు, మజ్జిగ వెంకటయ్య, సంతోష్, బండి నర్సింహులు, బండి జంగయ్య, బండి నర్సింహులు, చాపల శ్రీనివాస్, కొత్త చంద్రయ్య, మజ్జిగ నర్సింహులు, మజ్జిగ వెంకటయ్య, కావలి లక్ష్మయ్య, మజ్జిగ మహేశ్, మజ్జిగ సంతోష్, మజ్జిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలంలో వ్యాపార సముదాయాలను తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ బక్షినాయక్

మర్పల్లి, మే 23: వారం రోజుల్లో ఆర్టీసీ స్థలంలో కబ్జా చేసి రేకుల షెడ్డు వేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న వారు ఖాళీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని వికారాబాద్ డిపో మేనేజర్ భక్షి నాయక్ అన్నారు. ఆయన గురువారం ఆర్టీసీ స్థలంలోహద్దు రాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 528/2ఆ లో ఉన్న మూడెకరాల ఐదు గుంటల భూమిలో ప్రధానరోడ్డు పక్కన కొంత కాలంగా కొంత మంది రేకుల షెడ్డు వేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, ఇప్పటికే పలుమార్లు వారికి రాతపూర్వకంగా, సిబ్బంది చెప్పినా వారు స్థలాన్ని ఖాళీ చేయడం లేదన్నారు. వ్యాపారులతో మాట్లాడి వెంటనే ఖాళీ చేయాలని సూచించగా కొంత మంది వారం రోజులు గడువు అడిగారని, వారితో పాటు మిగతా వారికి వారం రోజుల సమయం ఇస్తున్నట్లు తెలిపారు. గడువులోపు రేకుల షెడ్డు తొలగించని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు ఆర్టీసీ స్థలం వేలంలో ఓ వ్యక్తి లీజుకు తీసుకున్నాడని, త్వరలోనే ఆ వ్యక్తికి ఆ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇది వరకే ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడి ఆర్టీసీ తరఫున లీజుకు తీసుకున్న వారికే దుకాణాలు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచినా కొంత మంది తప్ప మిగతా వారు స్పందించలేదన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అడ్డంకులు



వరిధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు

మేడ్చల్ టౌన్, మే 23: రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన రైతు సహకార సంఘాల చైర్మన్‌లు అడ్డంకులు సృష్టిస్తున్నారని మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించటానికి కనీసం బస్తాలు కూడా సహకార సంఘం వారు ఇవ్వడంలేదని ఆరోపించారు. మేడ్చల్ రైతు సహకార సంఘం చైర్మన్ రణదీప్‌రెడ్డి సొసైటీ పరిధిలోని రైతులకు బస్తాలు సరఫరా చేయడంలేదని ఆరోపించారు. పండించిన పంటలను రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు, రైస్‌మిల్లర్ల వద్దకు తరలించటానికి పూర్తి సహకారం అందించాలని ప్రభుత్వం ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చైర్మన్‌లు మాత్రం పట్టించు కోవటం లేదని ఆరోపించారు. గౌడవెల్లి గ్రామానికి చెందిన రైతులకు సహకార సంఘం తరఫున బస్తాలు సరఫరా చేయక పోవటంతో సొంత డబ్బులతో బస్తాలు కొనాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు.

వేసవి శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం



వేసవి శిబిరాన్ని సందర్శించిన హెచ్ఎం మంజుల

కులకచర్ల, మే 23: స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో వేసవి శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజుల అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలికల వేసవి శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మహిపాల్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ మండల ఇన్‌చార్జి నర్సింహులుగౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, మే 23: మండలంలోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలల ప్రారంభ సమయం దగ్గర పడుతుండటంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని సూచించారు. జూన్ మొదటి వారం నుంచి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, ఇన్‌చార్జి ఏపీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి



తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యాలాల కాంగ్రెస్ నాయకులు

యాలాల, మే 23: మండలాభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప అన్నారు. ఆయన గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మండల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రతీగ్రామం, మండలం, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయన్నారు. మండల అభివృద్ధిలో తనతో పాటు ప్రతీ ఒక్క నాయకుడి సమన్వయంతో ముందుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేయూత



అంగడిరైచూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

కొడంగల్ రూరల్, మే 23: అవసర్ ఫౌండేషన్ ఎన్జీవో, కొడంగల్ ప్రాంతానికి చెందిన శ్రీ బలభీమసేన ట్రస్టు సంస్థ ఆధ్వర్యంలో కొడంగల్‌లోని పలు పాఠశాలలకు చేయూతనందించారు. పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఈ మేరకు కొడంగల్ మండలంలోని ఐదు ప్రాథమికోన్నత పాఠశాలల, పరిగిలోని సరస్వతి శిశు మందిర్, కర్ణాటక రాష్ట్రం సేవం తాలూకాలోని చిట్లర కోట్రికె గ్రామంలోని పాఠశాలలకు క్రీడా సామగ్రిని అందజేశారు. అదేవిధంగా కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ పొందేందుకు అవసరమైన కంప్యూటర్‌లు, సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కులకచర్ల, మే 23: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్యదర్శులు పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. వచ్చే వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని మురికి కాల్వల్లో మట్టి తొలగింపు, చెత్త సేకరణ పనులను కార్మికులు చేపడుతున్నారు. గురువారం కులకచర్ల, పుట్టపహాడ్ గ్రామాల్లో కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, కవితలు పారిశుధ్య పనులు చేయించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



బాలమ్మ (ఫైల్)



మృతురాలి ఇంటి వద్ద క్లూస్ టీంతో పోలీసు సిబ్బంది

దోమ, మే 23: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన దోమ మండలంలోని దాదాపూర్ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాలమ్మ(67) అనే వృద్ధురాలు రాత్రి తాను నిద్రించిన మంచంపైనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వృద్ధురాలికి తీవ్ర రక్తస్రావమైంది. ముక్కుకు ఉన్న బంగారు ముక్కెర కనిపించకపోవడంతో మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎవరైనా హత్య చేసి ఉండొచ్చనే అనుమానంతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గతంలో తండాకు చెందిన ఓ వ్యక్తికి బాలమ్మ డబ్బులు ఇచ్చిందని, ఆ డబ్బుల విషయంలో ఆ వ్యక్తి గొడవ చేశాడని మృతురాలి కుటుంబసభ్యులు తెలిపారు. బాలమ్మ కుమారులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అదే అదను గా భావించిన సదరు వ్యక్తి హత్యచేసి ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

అన్నోజిగూడలో చైన్‌స్నాచింగ్



బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్ రూరల్, మే 23: స్కూటీపై వెళ్తున్న విద్యార్థిని మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్, ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన బీ-ఫార్మసీ విద్యార్థిని ఎర్రి శ్రీజ తన తల్లి సునీతతో కలిసి జోడిమెట్ల నుంచి ఇంటికి స్కూటీపై వస్తుండగా అన్నోజిగూడ వంతెన వద్ద గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వెంబడించారు. గమనించిన సునీత స్కూటీపై వేగంగా వెళ్తుండగా వెనుక కూర్చున శ్రీజ మెడలోని తులం బంగారు గొలుసును లాగడంతో బైక్‌పై నుంచి పడిపోయారు. గాయాలపాలైన వారిద్దరినీ స్థానికులు సమీపంలోని నీలిమ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనాస్థలాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి చేరుకొని చైన్‌స్నాచింగ్ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి బాధితురాలను పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూకబ్జాకు యత్నించిన నిందితుడి అరెస్టు

కీసర రూరల్, మే 23: నకిలీ డాక్యుమెంట్‌తో భూకబ్జాకు యత్నించిన వ్యక్తిని కీసర పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట్ మండలం రేణిగుంట గ్రామానికి చెందిన సత్తు మహేష్ దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రగతినగర్‌లో నివాసముంటున్నాడు. అతడితో పాటు మరికొంత మంది పాషాబాయి, వీరభద్రరావు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి కీసర మండలం గోధుమకుంట రెవెన్యూ సర్వే నెంబర్ 157, 136 -1677లో ఏర్పాటు చేసిన టీపీఎస్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్లాట్ నెంబర్ 57, 58లోని 532చదరపు గజాల స్థలాన్ని కొట్టేయాలని పథకం వేశారు. ఇందుకు నకిలీ దస్తావేజును సృష్టించి అంకం వీరభద్రరాజు పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆన్‌లైన్‌లో ఈసీ సెర్చ్ చేయగా వారి ప్లాట్ నంబర్‌పైన అసలైన యజమానికి బదులుగా మరొకరి పేరు వస్తోంది. దీంతో అనుమానం వచ్చిన యజమాని కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు కూపీ లాగారు. అందులో భాగంగా వీరభద్రరావును గతంలోనే అరెస్టు చేయగా గురువారం సత్తు మహేష్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

ఫీర్జాదిగూడ మేయర్‌పై దాడి.. పలువురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 23: ఫీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కిడ్నాప్‌కు యత్నించి దాడిచేసిన కార్పొరేటర్ అమర్‌సింగ్ అతడి అనుచరులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న ఫీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు సూర్యపేట్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు కార్లలో వెళ్తున్నారు. పెద్ద అంబర్‌పేట్ అవుటర్ రింగ్‌రోడ్డు వద్ద ఫీర్జాదిగూడ కార్పొరేటర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్ వీరి అనుచరులు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కారును వెంబడించి కిడ్నాప్‌కు యత్నించాడు. అదేరోజు రాత్రి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద వెంకట్‌రెడ్డి కారుకు అడ్డంగా కార్లు ఆపి అమర్‌సింగ్, శివకుమార్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహారెడ్డిలతో పాటు పలువురు దాడికి యత్నించారు. తేరుకున్న మేయర్ పోలీసులకు, మీడియాకు సమాచారం అందించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో జక్కా వెంకట్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడికేసులో వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, మే 23: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపల్, అన్నోజిగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని ఈనెల 6వ తేదీన అదే ప్రాంతానికి చెందిన కొంతం కిరణ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగరాజురెడ్డి, వినయ్‌రెడ్డిలు దాడిచేసి గాయపరిచారు. శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి గురువారం కొంతం కిరణ్‌రెడ్డిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురిని త్వరలో అదుపులోకి తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం పోలీసులు తెలిపారు.

వేసవి సెలవులకు వెళ్లి.. అనంత లోకాలకు

● బొలెరో రివర్స్ తీస్తుండగా ఢీకొని బాలిక దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, మే 23: వేసవి సెలవులకు చిన్నమ్మ ఇంటికి వెళ్లిన బాలిక బొలెరో ఢీకొని మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం గ్రామ పంచాయతీ పెద్దయ్యగడ్డ తండాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొత్తూరు మండలం కొడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గాజీగూడ తండాకు చెందిన కావ్య(16) ఇటీవల 9వ తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. వేసవి సెలవులు కావడంతో రెండు రోజుల క్రితం ఆమె చిన్నమ్మ పెద్దయ్యగడ్డ తండాలోని ఇంటికి తీసుకెళ్లింది. గురువారం తిరిగి ఆ బాలిక సొంతూరుకు వెళ్లాల్సి ఉండగా.. చిన్నమ్మ కుమారుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో శుక్రవారం తీసుకెళ్తానని చెప్పింది. ఈక్రమంలో ఇంటి బయట కావ్య నిలిచి ఉండగా తండాకు చెందిన సీతారాం నాయక్ అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న బొలెరో వాహనాన్ని వేగంగా రివర్స్ తీశాడు. దాంతో కావ్యకు బలంగా తగిలి కిందపడి పోయింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు.

కారును ఢీకొన్న లారీ.. ఒకరికి గాయాలు

మొయినాబాద్, మే 23: రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని కేతిరెడ్డిపల్లి స్టేజీసమీపంలో గురువారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఓ లారీ చేవెళ్ల వైపు వెళుతోంది. ఈక్రమంలో కేతిరెడ్డిపల్లి స్టేజీ వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న మరో లారీ రోడ్డు పైకి వచ్చింది. ఇంతలో చేవెళ్ల వైపు వెళుతున్న కారు డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వస్తున్న మరో లారీ కారును బలంగా ఢీకొంది. కారు వెనుక భాగం నుజ్జునుజ్జయ్యింది. కాగా, ప్రమాదంలో నగరంలోని షేక్‌పేటకు చెందిన కారు డ్రైవర్ వెంకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు అతడు మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.